## క్లుప్తంగా

### విద్యార్థులకు దుస్తుల పంపిణీ


దుస్తులు అందుకున్న విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

**బద్వేలు :** పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం పంచాయతీలోని ఎస్సీ, ఎస్టీ వసతి గృహంలోని విద్యార్థులకు చిల్డ్రన్ ఇన్ నీడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు చిత్తా థామస్‌రెడ్డి, గీతల సహకారంతో సోమవారం దుస్తులు పంపిణీ చేశారు. సంస్థ ప్రతినిధులు ప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డిలు వైఎస్సార్‌సీపీ నాయకులు చిత్తా గిరి ప్రణీత్‌రెడ్డి చేతుల మీదుగా 250 మంది విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో వసతిగృహ సిబ్బంది పాల్గొన్నారు.

### ఇళ్ల నిర్మాణం త్వరగా పూర్తి చేయండి


ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి నాగేశ్వరరావు

**మైదుకూరు :** జగనన్న ఇళ్ల కాలనీలో లబ్ధిదారులు త్వరగా పక్కా ఇళ్లను పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా వ్యవసాయాధికారి ఎ.నాగేశ్వరరావు అన్నారు. సోమవారం మండలంలోని వనిపెంట జగనన్న కాలనీలో ఆయన లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాలనీలోని మొత్తం 136 ఇళ్లకుగాను 11 ఇళ్లు పూర్తయ్యాయని, 30 ఇళ్లు పైకప్పు పూర్తయ్యాయని, 34 ఇళ్లపై కప్పు వేయాల్సి ఉందని హౌసింగ్ ఏఈ బ్రహ్మానందరెడ్డి, ప్రత్యేక అధికారికి వివరించారు.

### రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న సీబీఐటీ యాజమాన్యం

**చాపాడు :** ఈ నెల 3, 4వ తేదీల్లో నంద్యాలలో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(శాప్) ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీల్లో స్థానిక చైతన్య భారతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ)కాలేజీ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చాటినట్లు కరస్పాండెంట్ వి.జయచంద్రారెడ్డి తెలిపారు. ఈఈఈ విభాగంలో ఫస్టియర్ విద్యార్థి నాగ అపర్ణ రజత పతకం, గ్రూప్ ఈఈఈ విభాగంలో ప్రణవి, నాగ అపర్ణ, సెకెండియర్ విద్యార్థిని మునిజా కాంస్య పథకాలు సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ డా.జి.శ్రీనివాసులరెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

### వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించండి


వెన్నపూస రవీంద్రారెడ్డికి ఓటు వేసి గెలిపించాలని ప్రచారం చేస్తున్న దృశ్యం

**ప్రొద్దుటూరు :** పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న వెన్నపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు వెన్నపూస హర్షవర్ధన్‌రెడ్డి, ఎస్వీ మధుసూదన్‌రెడ్డి కోరారు. మండలంలోని పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వెళ్లి సోమవారం ప్రచారం నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ మొదటి ప్రాధాన్యత ఓటు వేసి రవీంద్రారెడ్డి గెలిపించాలని అభ్యర్థించారు.

### శ్రియారెడ్డికి నాట్య మయూరి అవార్డు


నాట్యమయూరి అవార్డు పొందిన శ్రియారెడ్డి

**ప్రొద్దుటూరు కల్చరల్ :** స్థానిక వైఎంఆర్ కాలనీకి చెందిన టీటీడీ శ్వేత అకాడమి మాజీ డైరెక్టర్ డాక్టర్ కె.రామాంజులరెడ్డి, హరితల కుమార్తె కె.శ్రియారెడ్డి నాట్యమయూరి అవార్డు సాధించింది. ఈనెల 6, 7, 8 తేదీల్లో చిలకలూరిపేటలో కళానిలయం ఆధ్వర్యంలో 38వ ఆల్ ఇండియా స్థాయి నవరస శాస్త్రీయ జానపద, సంగీత, నాట్య కళారూపాల పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో శ్రియారెడ్డి 'కృతి' నాట్య ప్రదర్శన ఇచ్చి రెండో బహుమతి నాట్యమయూరి అవార్డు సాధించినట్లు ఆమె తండ్రి రామాంజులరెడ్డి తెలిపారు. శ్రియా రెడ్డిని నాట్య గురువు శ్రావణి, తల్లిదండ్రులు అభినందించారు.

# అభివృద్ధి, సంక్షేమంలో ఆదర్శం

- ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ
- బి.కోడూరులో పింఛన్ల పంపిణీలో పాల్గొన్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి


గిరినగర్‌లో మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ


పింఛన్‌దారులకు పింఛన్ అందజేస్తున్న ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి

**బద్వేలు :** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిలో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తోందని బద్వేల్ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి సుధ పేర్కొన్నారు. పోరుమామిళ్ల మండలంలోని రంగసముద్రం సచివాలయం–2 పరిధిలోని గిరినగర్‌లోని 5, 6, 7వ వార్డుల్లో సర్పంచ్ చిత్తా రవి ప్రకాష్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, వాటి లబ్ధిని ప్రజలకు వివరించారు. వారి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి అధికారులకు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిరంతరం ప్రజల సంక్షేమానికి, అభివృద్ధికి పని చేస్తోందన్నారు. అర్హతే ప్రామాణికంగా పథకాలు ప్రతి ఇంటికి అందిస్తున్నామని చెప్పారు. బద్వేల్ నియోజకవర్గంలో దాదాపు రూ.వెయ్యి కోట్ల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. పోరుమామిళ్ల మండలంలోని గ్రామాల అభివృద్ధికి రూ.20 కోట్లు పైనే వెచ్చించి తారు రోడ్లు ఏర్పాటు చేశామన్నారు. పట్టణాన్ని సమస్యలు లేకుండా తీర్చిదిద్దేందుకు రూ.17 కోట్లతో రంగసముద్రం పరిధిలోని నర్సింగ్‌పల్లె నుంచి మల్లకతువ వరకు ప్రధాన రహదారిని విస్తరిస్తున్నామని చెప్పారు. డ్రైనేజీ, సిమెంట్‌రోడ్ల నిర్మాణాలు చేపడుతున్నామని వివరించారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి మద్దతు పలకాలని ఆమె కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సి.బాషా, యువజన నాయకులు గిరిప్రజీత్‌రెడ్డి, ఎంపీటీసీలు కవలకూరి రమణ, ఇషాక్, మహబూబ్‌పీరా, జల్లి చెంద్రాయుడు, ఆదిబోయిన కొండయ్య, బాలుడు, రుద్రవరం ప్రసాద్, ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్‌డీ భాస్కర్‌బాబు, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

**అవ్వాతాతలకు అండగా వైఎస్సార్‌సీపీ**

**బి.కోడూరు :** అవ్వాతాతలకు మరింత అండగా ఉంటామంటూ సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను అందజేస్తున్నారని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండల కేంద్రంలోని వెలుగు సభా భవనంలో ఏర్పాటు చేసిన పింఛన్ వారోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం అవ్వాతాతల పింఛన్‌ను దఫాలుగా పెంచుతూ అవ్వాతాతలకు అండగా నిలుస్తున్నారని తెలిపారు. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలంటే రాబోయే ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను ముఖ్యమంత్రిని చేసేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కోడూరు చెన్నమ్మ, జెడ్పీటీసీ దావీదు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామకృష్ణారెడ్డి, మండల స్పెషలాఫీసర్ రమణారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీఓ చంద్రమౌళీశ్వర్, సర్పంచ్‌లు, పింఛన్‌దారులు తదితరులు పాల్గొన్నారు.

**పాదయాత్ర సాక్షిగా సంక్షేమం**

**బద్వేలు అర్బన్ :** వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపక్ష నేత హోదాలో చేపట్టిన పాదయాత్ర సాక్షిగా నేడు ముఖ్యమంత్రి హోదాలో పేదల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. దేశ రాజకీయాల్లో చారిత్రత్మకంగా నిలిచిపోయేలా వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన ప్రజాసంకల్ప పాదయాత్ర ముగిసి నాలుగేళ్ళు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం స్థానిక బైపాస్ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడి నుండి నెల్లూరు రోడ్డులోని పార్టీ కార్యాలయం వరకు ర్యాలీగా చేరుకుని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2017 నవంబర్ 6న ఇడుపులపాయలో వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన పాదయాత్ర 13 జిల్లాలలోని 134 నియోజకవర్గాల్లోని 231 మండలాల్లో ఉన్న 2516 గ్రామాల మీదుగా 3648 కిలోమీటర్లు సాగిందన్నారు. పాదయాత్రలో ప్రజల కష్టాలను కళ్లారా చూసిన జగన్ మోహన్‌రెడ్డి నేను విన్నాను, నేను ఉన్నాను అనే నినాదంతో అనేక సంక్షేమ పథకాలను రూపొందించి వాటిని అనతికాలంలోనే అమలు చేసిన ప్రజా సంక్షేమ సాధకుడిగా జగనన్న నిలిచారన్నారు. మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, సివిల్ సప్లెస్ కార్పొరేషన్ డైరెక్టర్ సుందర్‌రామిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ ఆర్.వి.సాయిక్రిష్ణ, మాజీ మున్సిపల్ చైర్మన్ డాక్టర్ బి.మునెయ్య, వైఎస్సార్‌సీపీ పశ్చిమ కన్వీనర్ యద్దారెడ్డి, మండల కన్వీనర్ మల్లేశ్వర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నరసింహారెడ్డి, కౌన్సిలర్లు ఓబుల్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, చెన్నయ్య పాల్గొన్నారు.

### పాఠశాలల బలోపేతానికి కృషి చేయాలి

**చాపాడు :** మండలంలోని ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ రవిశంకర్ పేర్కొన్నారు. స్థానిక మండల రీసోర్స్ కార్యాలయం వద్ద సోమవారం ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు మౌలిక సదుపాలయాల కల్పనపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పంచాయతీల వారీగా పాఠశాలల అభివృద్ధికి సత్వర చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పేరెంట్స్ కమిటీ సభ్యులతో సమావేశం కావాలన్నారు.

### స్పోర్ట్స్ మీట్‌లో విద్యార్థుల ప్రతిభ

**బద్వేలు అర్బన్ :** ప్రొద్దుటూరులోని పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మూడు రోజుల పాటు జరిగిన ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ జిల్లా స్థాయి పోటీల్లో పట్టణంలోని ఎస్‌వీసీఎం పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపినట్లు ఎస్‌వీసీఎం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.శ్రీనివాస్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అథ్లెటిక్స్ విభాగం 800 మీటర్ల రన్నింగ్‌లో పి.రాజశేఖర్ ప్రథమ బహుమతిని కైవసం చేసుకోగా, బాల్‌బాడ్మింటన్‌లో కళాశాల జట్టు ద్వితీయ స్థానంలో నిలిచిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎం.చంద్రమోహన్, ఏఓ శివక్రిష్ణ, వైస్ ప్రిన్సిపల్ పి.పి.ఎస్.ప్రసాద్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి


మాట్లాడుతున్న వైద్యాధికారి రాజేష్ కుమార్

**చాపాడు :** గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవాలని మండల వైద్యాధికారి రాజేష్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష యోజనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ మండల పరిధిలో గర్భిణులు ప్రతి నెలా వైద్య పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకొని రక్త హీనత లేకుండా చూసుకోవాలన్నారు. అనంతరం ఇక్కడికి వచ్చిన గర్భిణులు, వైద్య సిబ్బందికి మండలంలోని అల్లాడుపల్లెకు చెందిన మధుసూదన్‌రెడ్డి, లలిత దంపతులు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా అన్నదాతలను వైద్య సిబ్బంది ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైద్యుడు వీరేంద్ర సింగ్, సీహెచ్‌ఓ రాముడు, సూపర్‌వైజర్ సరస్వతి, ఎఫ్‌పీసీ పర్యవేక్షకులు భాస్కర్, రమేష్, నారాయణరెడ్డి, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ


భూమి పూజ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి

**ప్రొద్దుటూరు :** మున్సిపాలిటీ పరిధిలోని 38వ వార్డులో గడపగడపకు మన ప్రభుత్వంలో కార్యక్రమంలో భాగంగా మంజూరైన రూ.17.50 లక్షలతో చేపట్టే సిమెంటు రోడ్డు, డ్రైనేజి కాలువ నిర్మాణ పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి సోమవారం భూమి పూజ చేశారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తిరిగిన వార్డులకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఆ నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ పల్లా రమాదేవి, వార్డు ఇన్‌చార్జి పల్లా సురేష్, కౌన్సిలర్ అనిల్, వైఎస్సార్‌సీపీ నాయకులు అంజి, పోసా భాస్కర్, బలిమిడి చిన్నరాజు, జలంధర్, దేవి, ఏఈ ఉమామహేశ్వరి పాల్గొన్నారు.

## పంట నమోదు రైతు బాధ్యత


ఈ-పంట నమోదును పరిశీలిస్తున్న మండల ప్రత్యేకాధికారి నాగరాజు

**గోపవరం :** సాగు చేసిన పంటలను పంట నమోదు చేయించుకోవడం రైతు బాధ్యత అని మండల ప్రత్యేకాధికారి, బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజు పేర్కొన్నారు. సోమవారం మండలంలోని చిన్న గోపవరం గ్రామంలో రబీలో సాగుచేసిన పంట నమోదు కార్యక్రమాన్ని ఏఓ అరవిందనాయక్‌తో కలిసి తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పంట నమోదు చేయించుకున్న రైతులకు మాత్రమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయపరంగా అందించే పథకాలకు అర్హులని ఆయన తెలిపారు. రైతు తాను ఏ పంట సాగుచేసినది స్థానిక ఆర్బీకే కేంద్రానికి వెళ్లి అక్కడి సిబ్బందికి తెలియజేసి వారి ద్వారా పంట నమోదు చేయించుకోవాలని తెలిపారు. అలాగే అన్ని ఆర్బీకే కేంద్రాల్లో రైతులకు అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. అంతకు ముందు గోపవరం సచివాలయంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి విజయ కుమార్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## స్పందనను సద్వినియోగం చేసుకోండి


అర్జీలను పరిశీలిస్తున్న అధికారులు

**గోపవరం :** స్థానిక రెవెన్యూ కార్యాలయంలో వారం వారం నిర్వహించే స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజు అన్నారు. సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్య ఏదైనా రోజులలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అన్నిశాఖల అధికారులు ఒకేచోట స్పందన కార్యక్రమంలో పాల్గొంటున్నందున ఏ సమస్యనైనా అర్జీ రూపంలో ఇచ్చి పరిష్కరించుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అన్ని సచివాలయాల్లోనూ స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నారని, అక్కడ కూడా అర్జీలు ఇవ్వవచ్చన్నారు. కార్యక్రమంలో తహసీల్దారు జీవన్‌చంద్రశేఖర్, ఎంపీడీఓ హరినారాయణ, ఏఓ అరవిందనాయక్, పీఆర్ ఏఈ చిట్టిబాబు, ఏపీఎం శివప్రసాద్, ఏపీఓ జయచంద్ర, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

## పీఎంఎస్‌ఎంఏ ప్రోగ్రాం తనిఖీ

**బ్రహ్మంగారిమఠం :** బ్రహ్మంగారిమఠంలోని ప్రాథమిక వైద్య శాలలో ప్రతి నెల 9న నిర్వహిస్తున్న పీఎంఎస్‌ఎంఏ ప్రోగ్రాంను సోమవారం అడిషనల్ డీఎంహెచ్‌ఓ ఖాదర్‌వలి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన వైద్య సిబ్బందిని పిలిపించి క్షేత్రస్థాయిలో నిర్వహిస్తున్న కార్యక్రమాల గురించి ఆరాతీశారు.

వైద్య సిబ్బంది విధిగా విధులకు హాజరై సక్రమంగా విధులు నిర్వహించాలన్నారు. గత వారం రోజులుగా బ్రహ్మంగారిమఠం మండలం డి.నేలటూరు సచివాలయం పరిధిలోని జరుగుతున్న నేషనల్ టీబీ సర్వేను తనిఖీ చేశారు. జలుబు, దగ్గు, జ్వరం ఉన్న వారు బరువు తక్కువగా ఉండటం, ఆకలి లేకపోవడం, గర్భిణులు, బీపీ, షుగర్, క్యాన్సర్ రోగులు తప్పకుండా టీబీ గల్ల పరీక్ష చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్లు ఫలణి రాజు, సంపత్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ ప్రభాకర్, సూపర్‌వైజర్లు పుష్పరాజ్, రమణమ్మ, హెల్త్ అసిస్టెంట్లు డి.వెంకటసుబ్బయ్య, టి.మాధవనాయుడు, బ్రహ్మారెడ్డి, సురేష్, శారద, సి.నాగమణి, ఆశా వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

### రికార్డులు పరిశీలించిన అదనపు డీఎంహెచ్‌ఓ

**మైదుకూరు :** మండలంలోని వనిపెంట పీహెచ్‌సీని సోమవారం అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఖాదరవలి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా లెప్రసీ, క్షయ, గర్భిణులకు సంబంధించిన రికార్డులను ఆయన పరిశీలించారు. ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ గురించి వైద్యాధికారి మల్లేష్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డాక్టర్ మనోహర్ ఉన్నారు.

### లింగాలదిన్నెపల్లెలో చోరీ

**బ్రహ్మంగారిమఠం :** మండలంలోని లింగాలదిన్నెపల్లెలో సోమవారం సాయంత్రం లింగాలదిన్నె బంగారురెడ్డి గారి నరసింహారెడ్డి ఇంటిలో చోరీ జరిగింది. ఎస్‌ఐ విద్యాసాగర్ తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నరసింహారెడ్డి ఇంటిలో కుటుంబ సభ్యులు పొలం పనులకు వెళ్లారు. సాయంత్రం వారు ఇంటికి వచ్చి చూసేసరికి.. తలుపు పగలగొట్టి ఉండటంతో ఆందోళన చెందారు. బీరువాను పరిశీలించగా, రూ.1.57 లక్షల నగదు, 18 తులాల బంగారు నగలు దొంగలు చోరీ చేసినట్లు గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలిపారు. వెంటనే ఎస్‌ఐ విద్యాసాగర్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మైదుకూరు రూరల్ సీఐ నరేంద్రరెడ్డి.. నరసింహారెడ్డిని పరిశీలించారు. దొంగతనంపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సంఘనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### గాయపడిన ఉపాధ్యాయుడి మృతి

**మైదుకూరు :** మైదుకూరు పట్టణ శివారులో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఉపాధ్యాయుడు దేవసహాయం (55) చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందారు. ఈనెల ఐదో తేదీన స్థానిక నంద్యాల రోడ్డులోని శ్రీనగరం వద్ద ద్విచక్రవాహనంపై వెళుతూ ఎల్‌ఎఫ్‌ఎల్ హెడ్ టీచర్‌గా పని చేస్తున్న అంధుడైన దేవసహాయం తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. కర్నూలులో చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

### క్లాప్ మిత్రలకు పెండింగ్ వేతనాలు చెల్లించాలి

స్వచ్ఛభారత్ కార్మికుల ధర్నా

**కడప సెవెన్‌రోడ్స్:** గ్రామ పంచాయతీల్లో రోడ్లు, కాలువలు, పరిసరాలను శుభ్రం చేస్తున్న జగనన్న క్లాప్‌మిత్రలకు పది నెలలుగా పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరుతూ స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించింది. స్వచ్ఛభారత్ యూనియన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు హనుమంతు, శ్రీరాములు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు వేణుగోపాల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్పంచులతో సంబంధం లేకుండా వేతనాలు ఇవ్వాలన్నారు. జీఓ 680 ప్రకారం వేతనాలు పెంచి కనీస వేతనం ఇవ్వాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా, నగర అధ్యక్షులు పి.సుబ్బరాయుడు, హుసేన్, స్వచ్ఛభారత్ కార్మికుల యూనియన్ జిల్లా అధ్యక్షులు వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

### సౌత్‌జోన్ చాంపియన్‌లకు అభినందన

**వైవీయూ :** తిరుపతి పద్మావతి విశ్వవిద్యాలయంలో ఈనెల 6,7 తేదీల్లో నిర్వహించిన 36వ దక్షిణ భారతస్థాయి అంతర్ విశ్వవిద్యాలయాల యువజనోత్సవాల్లో వైవీయూ ఫైన్‌ఆర్ట్స్ విద్యార్థులు చాంపియన్‌లుగా నిలవడంపై వైవీయూ నూతన వైస్ చాన్సలర్ ఆచార్య జింక రంగ జనార్దన్ అభినందించారు. ఫిబ్రవరి 24న బెంగుళూరులోని జైన్ విశ్వవిద్యాలయంలో నిర్వహించే జాతీయస్థాయి యువజనోత్సవాల్లో రాణించి విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య మాట్లాడారు. ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, కల్చరల్ విభాగం సమన్వయకర్త, ఆర్ట్స్ విభాగం డీన్ ఆచార్య తప్పెట రామప్రసాద్‌రెడ్డి, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ డా. పి. సరిత, లలితకళల విభాగం సమన్వయకర్త కోట మృత్యుంజయరావు, ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి


ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి

**దువ్వూరు :** అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందిస్తోందని ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని కృష్ణంపల్లె గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరినీ గుర్తించి సంక్షేమ పథకాలను అందించాల్సిన బాధ్యత వలంటీర్లు, సచివాలయ సిబ్బందిపై ఉందని తెలిపారు. అనంతరం ఆయన ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిశీలించి పరిష్కరించాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు ఇరగంరెడ్డి తిరుపాల్‌రెడ్డి, ఎంపీపీ కానాల జయచంద్రారెడ్డి, జెడ్పీటీసీ మేరువ కృష్ణయ్య, సర్పంచ్ మేరువ నాగులు, ఎంపీటీసీ షేక్ ఇమాంబీ, వైఎస్సార్‌సీపీ నాయకులు ఓబుళరెడ్డి, విజయ్, యల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజయోగ సాధనతో ప్రశాంతత

షీలు దీదీజీ


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న దీదీజీలు, ఎమ్మెల్యే రఘురామిరెడ్డి

**ప్రొద్దుటూరు కల్చరల్ :** భారతీయ ప్రాచీన గృహస్థ ధర్మానికి చెందిన రాజయోగ సాధన చేయడం ద్వారా శారీరక, మానసిక రుగ్మతలు తొలగిపోయి ప్రశాంతంగా జీవించవచ్చని షీలు దీదీజి అన్నారు. స్థానిక విజయనగరం వీధిలోని ఓంశాంతి భవనంలో ఆత్మీయ స్నేహ మిళనం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజస్థాన్ మౌంట్ అబు నుంచి తపోమూర్తులు షీలు దీదీజి, లీలా దీదీజి, గీతా దీదీజి, విశ్వనాథ్ భాయిజీలు ప్రొద్దుటూరుకు వచ్చారు. వారిని మైదుకూరు ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి శాలువాలు, మెమెంటోలతో సత్కరించారు. ఈ సందర్భంగా షీలు దీదీజి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రాజయోగ సాధన చేయాలని కోరారు. ఎమ్మెల్యే రఘురామిరెడ్డి మాట్లాడుతూ అప్యాయత, అనురాగాలు, నైతిక విలువలు అంతరించి పోతున్న తరుణంలో రాజయోగ మనిషిలో క్రమశిక్షణ పెంచి విలువలు నేర్పిస్తుందన్నారు. ఓంశాంతి భవన్ నిర్వాహకురాలు బీకే శాంత, కౌన్సిలర్ పిట్టా బాలాజి, భక్తులు పాల్గొన్నారు.

## ఆర్‌అండ్‌బీ స్థలాల్లో బంకుల ఏర్పాటు

**బ్రహ్మంగారిమఠం :** ప్రముఖ పుణ్యక్షేత్రం, మండల కేంద్రమైన బ్రహ్మంగారిమఠంలో నాలుగు రోడ్ల కూడలిలో ఆర్‌అండ్‌బీ స్థలంలో బంకులు ఏర్పాటు చేస్తున్నారు. గతంలో ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి ఆదేశాల మేరకు ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి, జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డిలు ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పోలీసుల అధికారులతో ఆక్రమణలు తొలగించారు. బి.మఠం ఐదు రోడ్ల కూడలిలో విశాలంగా రోడ్లు ఏర్పడ్డాయి. గతంలో బంకులో ఉన్న వారు ఆ స్థలాలు మా ఆధీనంలో ఉన్నాయంటూ గత రెండు రోజులుగా నాలుగు రోడ్ల కూడలి పరిధిలో తిరిగి బంకులు ఏర్పాటు చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి ప్రభాకర్ సోమవారం సాయంత్రం బంకులు ఏర్పాటు చేయకూడదని, చిరు వ్యాపారులకు తోపుడు బండ్లు పెట్టుకునేందుకు అనుమితి ఇచ్చామని తెలిపారు. పోలీసులకు వారు ఫిర్యాదు చేయడంతో తోపుడు బండ్లకు మాత్రమే అనుమతి ఇస్తామని, ఆర్‌అండ్‌బీ స్థలంలో శాశ్వత బంకులు ఏర్పాటు చేస్తే తొలగిస్తామని ఎస్‌ఐ విద్యాసాగర్ తెలిపారు.

## మనసున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్


కల్లూరులో కేక్ కట్ చేస్తున్న సర్పంచ్ వల్లూరు శివలక్ష్మి నాగేంద్ర రెడ్డి

**ప్రొద్దుటూరు :** ప్రజా సంకల్పయాత్ర ద్వారా సమస్యలను తెలుసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సమస్యలను పరిష్కరిస్తూ మనసున్న సీఎంగా ఖ్యాతి గడించారని కల్లూరు గ్రామ పంచాయతీ సర్పంచ్ వల్లూరు శివలక్ష్మి నాగేంద్రరెడ్డి తెలిపారు. ప్రజా సంకల్ప యాత్ర పూర్తయి నాలుగేళ్లు అయిన సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం కల్లూరు గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద కేక్ కట్ చేసి అందరికి పంచారు. జగన్ సైన్యం, వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## టెన్నిస్ టోర్నీ చాంపియన్స్‌గా ఉమైర్ జోడి


ట్రోఫీ అందుకుంటున్న ఉమైర్-సూర్యారెడ్డి జోడి

**కడప స్పోర్ట్స్:** గుంటూరు నగరంలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఆదివారం నిర్వహించిన టెన్నిస్ చాంపియన్ షిప్–2023లో పురుషుల డబుల్స్ విభాగంలో కడప నగరానికి చెందిన ర్యాంకింగ్ క్రీడాకారుడు షేక్ ఉమైర్, డి. సూర్యారెడ్డి జోడి విజేతగా నిలిచి ట్రోఫీ కైవసం చేసుకుంది. వీరు ఫైనల్స్‌లో విజయవాడకు చెందిన సాయికృష్ణ, అజయ్‌కుమార్ జోడిపై విజయం సాధించి విజేతలుగా నిలిచారు. అదే విధంగా 65 ప్లస్ పురుషుల విభాగంలో కడప నగరానికి చెందిన ఎస్.ఎ.రజాక్, రమేష్‌బాబు జోడి రన్నర్స్ నిలిచారు. విజేతలకు కాగా టెన్నిస్ క్రీడాకారుడు షేక్ ఉమైర్ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎస్.బి.అంజద్‌బాషాకు స్వయాన అల్లుడు కావడం విశేషం. విజేతలకు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.